













మహాశివరాత్రి ఉత్సవాలకు సర్వం సిద్ధం

పెరవలి: మహాశివరాత్రి ఉత్సవాలకు సర్వం సిద్ధం చేశారు. శివాలయాలన్నీ ముస్తాబయ్యాయి. స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏరాట్లు పూర్తి చేశారు. ఆలయాల ముందు చలువ పందెళ్లు, విద్యుద్దీపాలు, భారీకేట్ల ఏర్పాటు చేశారు. వశిష్ఠ గోదావరీ తీరాన మల్లేశ్వరం గ్రామంలో స్వయంభూగా వెలసిన కపిల మల్లేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి మహోత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ దేవాలయం ఒక విశిష్ఠత సంతరించుకుంది. ఈ శివాలయంలో ఉన్న శివలింగం నిత్యం జలాదీవాస దీక్షలో ఉంటుంది. ఇలా నీళ్లలో శివలింగం మునిగి ఉండడం రాష్ట్రంలో ఎక్కడా లేకపోవడంతో ఈ దేవాలయం పవిత్ర పుణ్యక్షేత్రంగా వెలసిల్లుతోంది. మహాశివరాత్రి ఉత్సవాలకు వచ్చే వేలాది మంది భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని ఆలయ అభివృద్ధి కమిటీ చెప్పారు. దూరప్రాంత భక్తుల కోసం భోజన వసతి కల్పించామని మధ్యాహ్నం నుంచి రథోత్సవం జరుగుతుందని చెప్పారు.

నేటి నుంచి కాటకూటేశ్వర లింగేశ్వరుని కల్యాణోత్సవాలు

నిడదవోలు రూరల్: మండలంలోని కాటకోటేశ్వరం గ్రామంలో ప్రసిద్ధిగాంచిన ఉమా కాటకూటేశ్వర లింగేశ్వర స్వామి 61వ వార్షికోత్సవ కల్యాణోత్సవాలు ఈనెల 8 తేదీ నుంచి 17వ తేదీ వరకు ఘనంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ చైర్మన్ కోసూరి భాస్కరరావు ఆధ్వర్యంలో ఉత్సవ కమిటీ సభ్యులు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. పరిసర ప్రాంతాల నుంచి తరలివచ్చే భక్తులు కోసం ఆలయ ప్రాంగణంలో చలువ పందెళ్లు సిద్ధం చేశారు. 8న స్వామి వారికి అభిషేకాలు, సినీ సంగీతవిభావరి, కోలాటం, అన్నసమారాధన, 9న బుర్రకథ, 10న ఏలూరు సుప్రీమ్ ఆర్కెస్ట్రా, 11న స్వామివారి ఊరేగింపు, సేవ, 12న దేవనర్తకి నాటకం, 13న కూచిపూడి నృత్యప్రదర్శన, 14న మోహన్ ఆర్కెస్ట్రా, 15న మ్యూజిక్ షో, మిమిక్రి, 16న కైలాసంలో కోర్టు నాటకం, 17న తేదీన భారీ అన్నసమారాధన, 22న భావన సినీ ఆర్కెస్ట్రా, సత్య హరిశ్చంద్ర పౌరాణిక నాటకం ఏర్పాటుచేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. కంసాలిపాలెం, రావిమెట్ల, కంసాలిపాలెం, సమిశ్రగూడెం, పందలపర్రు, విజ్జేశ్వరం గ్రామాల్లో శివరాత్రికి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.



కాటకోటేశ్వరంలో కాటకూటేశ్వర లింగేశ్వరస్వామి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన చలువ పందిళ్లు

అనంతపల్లిలో శివరాత్రి ఉత్సవాలు

నల్లజర్ల: వేంగీరాజుల చారిత్రక ఆనవాళ్లకు నిలయమైన అనంతపల్లిలోని బాలాత్రిపురసుందరీ సమేత వేగిలింగేశ్వరస్వామి ఆలయంలో శివరాత్రి ఉత్సవాలకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ చిక్కాలనాగేశ్వరావు, ఈఓ మద్దిరాల లక్ష్మీశరణ్య తెలిపారు. ఇక్కడ నాలుగు రోజుల పాటు ఉత్సవాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. దాతల సహకారంతో రూ.3లక్షలతో రథం కొనుగోలు చేసి ఈ ఏడాది ఉత్సవాల్లో స్వామివారిని ఊరేగించనున్నట్టు చెప్పారు. ఆస్ట్రేలియలో ఉంటున్న అనంతపల్లి వాసి నల్లజర్ల మాళీ రూ.4లక్షలతో స్వామివారి కల్యాణోత్సవానికి ప్రత్యేకంగా 80 అడుగుల విస్తీర్ణంలో ఓపెన్‌టాప్ ఉత్తరం వైపు ఏర్పాటు చేశారన్నారు. హైదరాబాదుకు చెందిన శేషవరపు సూర్యారావు జ్ఞాపకార్థం భార్య భారతీలక్ష్మి రూ.లక్షతో గోడలపై పాలరాతితో ద్వాదశ జ్యోతిర్లింగాలు, గ్రానైట్‌పై రూ.1లక్షలతో నల్లజర్ల వంశస్తులు అష్టాదశ శక్తి పీఠాలను ప్రత్యేకంగా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈవి శివరాత్రిరోజున ప్రారంభిస్తారన్నారు. తెలికిచెర్లలో ప్రకటీశ్వరస్వామి ఆలయంలో, దూబచర్ల లలిత కామేశ్వర స్వామి ఆలయంలో, నల్లజర్ల చంద్ర మౌళీశ్వరాలయం, పోతవరం శివాలయంలో ఏర్పాట్లు చేస్తున్నారు.



మల్లేశ్వరంలో కపిల మల్లేశ్వరస్వామి ఆలయం



కాటకూటేశ్వరం ప్రధాన రహదారిపై ఏర్పాటు చేసిన భారీ విద్యుత్‌దీపాల సెట్టింగులు

భక్తులకు అసౌకర్యాల్లేకుండా చర్యలు

- మహాశివరాత్రికి ఏర్పాట్లు పూర్తి
- గోష్పాదక్షేత్రంలో ఏర్పాట్లు పరిశీలించిన సబ్ కలెక్టర్ ఆశుతోష్ శ్రీవాస్తవ్

కొవ్వూరు: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా గోష్పాదక్షేత్రానికి తరలి వచ్చే భక్తులకు ఏవిధమైన అసౌకర్యాల్లేకుండా చర్యలు తీసుకోవాలని సబ్ కలెక్టర్ ఆశుతోష్ శ్రీవాస్తవ్, సహాయ కలెక్టర్ సి.యశ్వంత్‌కుమార్‌లు ఆదేశించారు. గురువారం సాయంత్రం వివిధ శాఖల అధికారులతో కలిసి క్షేత్రంలో ఏర్పాట్లని పరిశీలించారు. భక్తులకు తాగునీరు సరఫరా, క్షేత్రంలో పారిశుధ్యం, విద్యుత్‌లైట్లు ఏర్పాటు, దుస్తులు మార్చుకునే గదులు ఏర్పాటుకి మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాని కోరారు. ప్రాథమిక చికిత్స కేంద్రం ఏర్పాటు చేయించాలని సూచించారు.భద్రతను దృష్టిలో ఉంచుకుని క్షేత్రంలో అగ్నిమాపక శకటాన్ని అందుబాటులో ఉంచాలని సూచించారు. పార్కింగ్‌కి, ట్రాఫిక్ ఇబ్బందుల్లేకుండా చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను ఆదేశించారు. ఆలయం వద్ద దర్శనానికి ఏవిధమైన తొక్కిసలాట లేకుండా ఉండేందుకు బారీకేట్లు ఏర్పాటు చేయాలని సూచించారు. క్షేత్రంలో ఎప్పటికప్పుడు పారిశుధ్యం మెరగుపరచడమే కాకుండా స్నానఘట్టంలో బీచింగ్ చేయించాలని సూచించారు. మున్సిపల్ చైర్ పర్సన్ బావన రత్నకుమారి, కమిషనర్ కె.డానియేలు జోసఫ్, తహసీల్దార్ కె.మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.



కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో ఏర్పాట్లపై అధికారులకు సూచనలిస్తున్న సబ్ కలెక్టర్ ఆశుతోష్ శ్రీవాస్తవ్, సహాయ కలెక్టర్ యశ్వంత్‌కుమార్

ఎన్నికల మార్గదర్శకాలు తప్పనిసరిగా పాటిలించాలి

కొవ్వూరు: ఎన్నికల మార్గదర్శకాలను అనుసరించి సిబ్బంది బాధ్యతగా విధులు నిర్వర్తించాలని సబ్ కలెక్టర్ ఆశుతోష్ శ్రీవాస్తవ సూచించారు. గురువారం ఆర్డీవో కార్యాలయంలో ఫ్లయింగ్ స్క్వాడ్ ఎంసీసీ వీడియో వ్యూవింగ్ టీంలు, అకౌంటింగ్ టీంలకు నియోజకవర్గస్థాయి శిక్షణ తరగతులు నిర్వహించారు. రానున్న ఎన్నికల్లో వివిధ బాధ్యతలు కేటాయించిన అధికారులు, సిబ్బంది నిబద్ధతతో జవాబు దారీతనంలో పనిచేయాలని కోరారు. ఎన్నికల మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాల న్నారు. ఎటువంటి సందేహాలున్నా నివృత్తి చేసుకోవాలని సూచించారు. ఆయా బృందాలు క్షేత్ర స్థాయిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చర్యలపై శిక్షణలో తెలియజేశారు. సహాయ కలెక్టర్ సి.యశ్వంత్‌కుమార్,ఇతర అధికారులు పాల్గొన్నారు.

తాళ్లపూడిలో ట్రాఫిక్‌పై దృష్టి

తాళ్లపూడి: మండల కేంద్రమైన తాళ్లపూడిలో ట్రాఫిక్ సమస్యపై దృష్టి సారించినట్టు తాళ్లపూడి ఎస్సై శ్యాంసుందర్ తెలిపారు. గురువారం బజార్ సెంటర్‌లో ట్రాఫిక్ క్రమబద్ధీకరించారు. మార్కెట్లో పర్యటించి సిబ్బందికి, వాహనదారులకు జాగ్రత్తలు చెప్పారు. అందరూ ట్రాఫిక్ నిబంధనలకు పాటించాలని కోరారు. మెయిన్ రోడ్డు ఇరుకుగా ఉండడంతో ప్రజలకు ఇబ్బంది లేకుండా ఇప్పటికే భారీ వాహనాలు మెయిన్ రోడ్డులోకి రాకుండా దారి మళ్లించేలా చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. ట్రాఫిక్ విషయంలో ఎప్పటికప్పుడు తమ సిబ్బంది పర్యవేక్షణ చేస్తున్నారన్నారు.





























